క్లుప్తంగా

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపిక



షేక్షావలిని అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

ఆదోని రూరల్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ సెలక్షన్ అండర్-14 విభాగం 600 మీటర్ల పరుగుపందెంలో 9వ తరగతి చదువుతున్న షేక్షా వలి కాంస్య పతకం సాధించినట్లు హెచ్‌ఎం మారుతిప్రియ తెలిపారు. దీంతో రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యాడన్నారు. ఈనెల 8 నుంచి గుంటూరు జిల్లా పల్నాడులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థి పాల్గొంటాడన్నారు. విద్యార్థి ఎంపికకు కృషి చేసిన పీఈటీ నరసింహరాజు, రమేష్‌లను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు సూర్యనారాయణ, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా దశిమి వేడుకలు



స్వామి వారి అశ్వాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లలో వెలసిన చింతలాముని, నల్లారెడ్డి స్వాముల చిన్న దశిమి వేడుకలు మంగళవారం వైభవంగా జరిగాయి. దశిమి వేడుకలు తెల్లవారు జామున దేవాలయ అర్చకులు, పీఠాధిపతులు, భక్తులు స్వాముల వారిని వెండి ఆభరణలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. తెల్లవారు జామున స్వామి అశ్వాన్ని ఓబులేషు స్వామి దేవాలయం నుంచి చింతలాముని, నల్లారెడ్డి దేవాలయం వరకు ఊరేగించారు. అలాగే ఉత్సవ విగ్రహాలను పల్లకీలో మేళతాళలతో ఊరేగించారు.

వర్షం కోసం ప్రత్యేక పూజలు



చలువ బిందెలతో భక్తుల ఊరేగింపు

పెద్దకడబూరు : మండల కేంద్రంలో మంగళవారం వర్షం కోసం ప్రత్యేక పూజలు చేపట్టారు. పెద్ద లక్ష్మమ్మవ్వ, చిన్న లక్ష్మమ్మవ్వ దేవాలయాల పూజారులు విశ్వబ్రాహ్మణ నరసింహాచారి, కేశవాచారి, వీరన్నాచారి ఆధ్వర్యంలో మంగళవారం శివప్రసాద్ ఆచారి, వినోద్‌కుమార్ ఆచారి ఉదయమే అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించి గంగపూజ గావించారు. చలువ బిందెలతో మంగళవాయిద్యాల నడుమ గ్రామంలో ఉన్న మల్లికార్జున స్వామి ఆలయం, కాళికాదేవి, సిద్దారూడస్వామి, రామాలయం, ముద్దురంగాస్వామి తదితర ఆలయాలకు వెళ్లి గంగాజలంతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పెద్ద లక్ష్మమ్మవ్వ ఆలయానికి చేరుకొని ధూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రామలింగారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ



విద్యార్థినికి కిట్‌ను అందజేస్తున్న ఎంఈఓ- 2

సాక్షి ఎఫెక్ట్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఎస్ఎంఎస్ జెడ్పీ హైస్కూల్‌లో కాంపౌండ్‌లో ఉన్న తెలుగు మెయిన్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను ఎంఈఓ 2 మధుసూదన్ రాజు పంపిణీ చేశారు. జూలై 31వ తేదీన సాక్షిలో 'వీలీన బడులు..విద్యార్థుల అగచాట్లు' అన్న శీర్షికన ప్రచురితమైన కథనానికి సమగ్ర శిక్ష ఎస్‌పీడీతో పాటు డీఈఓ స్పందించి కిట్ల పంపిణీపై ఆరా తీసి, సత్వరం కిట్లను విద్యార్థులకు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈ మేరకు ఎంఈఓ పాఠశాలకు వెళ్లి హెచ్‌ఎం సత్యనారాయణతో కలిసి కిట్లు అందని విద్యార్థులందరికీ విద్యార్థి మిత్ర కిట్లను పంపిణీ చేశారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

ఆదోని అర్బన్: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టర్ సమీవుల్లా, డాక్టర్ మాధవీలత, అవోపా పట్టణాధ్యక్షులు వంకదారు శ్రీనాథ్‌గుప్తా తెలిపారు. ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ అండ్ అవోపా మహిళా విభాగం ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులకు, బాలింతలకు పౌష్టికాహారం, పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అవోపా పట్టణ కార్యదర్శి రఘు, అవోపా మహిళా విభాగం అధ్యక్ష కార్యదర్శులు వంకదారు మమతాశ్రీ, ఎస్.శ్రీదేవి పాల్గొన్నారు.

మంత్రాలయం రూరల్ : మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-5లో సీడీపీఓ రాజేశ్వరి దేవి గర్భిణులు, బాలింతలు, తల్లులకు తల్లిపాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ప్రభుత్వవిద్యపై నిర్లక్ష్యం

- సర్కారు స్కూళ్లలో నిలిచిపోయిన నాడు–నేడు పనులు
- గదుల కొరతతో ఆరుబయటే చదువులు
- ఉపాధ్యాయులు లేక విద్యార్థుల ఇబ్బందులు
- స్కూలు బ్యాగుల్లోను నాణ్యత కరువు
- నెలలోగా చిరిగిన స్కూల్ బ్యాగులు



వందగల్లులో నిలిచిన నాడు-నేడు పనులు

కోసిగి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యాభివృద్ధిని పూర్తిగా విస్మరిస్తున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన నాడు–నేడు పనులు నిలిచిపోవడంతో విద్యార్థులకు కూర్చునేందుకు గదులు కొరత ఉండటంతో ఆరుబయటే చదువులు చెబుతున్నారు. దీనికితోడు ఉపాధ్యాయులు కొరత, చదువులు చెప్పే వారు లేక పోవడంతో మండలంలో సర్కారు బడులు దుర్భర స్థితి చేరుకున్నాయని మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఇటీవల కూటమి ప్రభుత్వం ఇచ్చిన స్కూల్ బ్యాగులు నాణ్యత లేకపోవడంతో నెలతిరక్కముందే చిరిగిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జగనన్న ప్రభుత్వంలో విద్యాభివృద్ధికి పెద్ద పీట

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పరిపాలన కాలంలో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులను తీర్చి దిద్దేందుకు చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగా నాడు–నేడు పథకానికి శ్రీకారం చుట్టి సర్కారు బడుల రూపురేఖలు మార్చేందుకు పూనుకున్నారు. మొదటి విడుత కింద కోసిగి మండలంలో రూ.11.50కోట్లతో 28 పాఠశాలలో పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో అదనపు గదులు, రన్నింగ్ అండ్ డ్రికింగ్ వాటర్, ఫర్నిచర్స్, విద్యార్థులకు టేబుల్స్ తదితర రకాల పనులు చేపట్టారు. రెండవ విడుతలో మండలంలో 40 పాఠశాలలకు రూ.26.11 కోట్లు కేటాయించారు. ఇందులో దాదాపు రూ.11.50కోట్లు దాఖ ఖర్చు చేశారు. అంతలోగా ఎన్నికల కోడ్ రావడంతో పనులు ఎక్కడిక్కడే నిలిచి పోయాయి.

కూటమి ప్రభుత్వం వచ్చాక ..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే దిశగా చర్యలు తీసుకుంది. ఒక విద్యా సంవత్సరం పూర్తిగా కాగా, మరో ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు కావస్తోంది. గత ప్రభుత్వం మండలంలో చేపట్టిన నాడు–నేడు పనులు పూర్తి చేస్తే ప్రస్తావనే లేవనెత్తడం లేదు. మండలంలోని వందగల్లు, దుద్ది, చింతకుంట, చిన్నభూంపల్లి, ఆర్లబండ, కందుకూరు, చిర్తనకల్లు పాఠశాలలో పనులు నిలిచి పోయాయి. విద్యార్థులు ఆయా గ్రామాల్లో గదుల కొరతతో ఇబ్బందులు పడుతున్నారు. ఆరుబయట, వరండాల్లో, ఇరుకు గదుల్లో విద్యాబోధన సాగిస్తున్నారు.

జగనన్న బ్యాగే బాగుంది



ఇప్పుడు కొత్తగా పాఠశాలలో ఇచ్చిన బ్యాగు చినిగి పోయింది. కుట్లు వేసుకుందామన్నా రావడం లేదు. బ్యాగును ఇంట్లోనే పడేసి గతంలో ఇచ్చిన జగనన్న బ్యాగు వాడుతున్నాను. కొత్తగా ఇచ్చిన దాని కన్నా ఆ బ్యాగు బాగుంది. మా పాఠశాలలో చాల మంది బ్యాగులు పోయాయి. పాత బ్యాగులే వాడుతున్నారు. – శిరిషా, దుద్ది

నాడు-నేడు పనులు పూర్తి చేయాలి

కూటమి ప్రభుత్వం మోసపూరిత హామీలతో కాలయాపన చేస్తున్నారు. గత ప్రభుత్వంలో నాడు–నేడు పథకం అమలు చేసి పాఠశాలల రూపు రేఖలు మార్చే దిశగా చర్యలు తీసుకున్నారు. నేడు కూటమి ప్రభుత్వం వచ్చాక పనులు ముందుకు సాగడంలేదు. తక్షణం పనులు పూర్తి చేయాలి. విద్యార్థులకు అందించిన స్కూల్ బ్యాగుల్లో నాణ్యత లేదు. గతంలో ఇచ్చిన బ్యాగులే బాగున్నాయని విద్యార్థులే చెబుతున్నారన్నారు. దీనిని బట్టి కూటమి పరిపాలన ఎలా సాగుతుందో ప్రజలకు అర్థమవుతోంది.

–మురళీ మోహన్ రెడ్డి,
వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి,

బ్యాగుల్లో నాణ్యత కరువు



వందగల్లు బాలుర ఉన్నత పాఠశాలలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన బ్యాగులు చిరిగి పోవడంతో జగనన్న బ్యాగులు వాడుతున్న విద్యార్థులు

2025–2026 విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో ఈ ఏడాది జూన్ నెలలో విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పేరుతో రాష్ట్రంలోని విద్యార్థులందరికీ స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. కోసిగి మండలంలో 27 ప్రాథమిక, 2 ప్రాథమికోన్నత, 11 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 1 కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, 1 ఏపీ మోడల్ స్కూల్ ఉన్నాయి . ఇందులో 1 నుంచి 10వ తరగతి వరకు 16,436 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందుకు గానూ 16,032 బ్యాగులు పంపిణీ చేశారు. బ్యాగులు నాణ్యత లేక పోవడంతో నెల లోపే చిరిగి పోయాయని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. చాలా పాఠశాలలో విద్యార్థులు గతంలో ఇచ్చిన జగనన్న బ్యాగులనే వాడుతున్నారు. ఏడాది పాలనలోనే బ్యాగులను నాణ్యతకు ఎసరు పెట్టారని విద్యార్థుల తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు.



దుద్ది గ్రామంలో చినిగి బ్యాగు, జగనన్న బ్యాగు తేడా చూపుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి. మురళీ మోహన్ రెడ్డి

పంట నమోదు చేయించుకోండి

నందవరం : రైతులు సాగు చేసిన పంటలకు ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలని ఏఓ సరిత సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. పంట నమోదు ద్వారా ప్రభుత్వం అందించే పథకాలకు అర్హులవుతారని వివరించారు. పంట నమోదుతో పంటల ఇన్సూరెన్స్ వర్తిస్తుందన్నారు. పంటల బీమా ప్రీమియం రైతులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీఈఓలు శ్రీనివాసులు, రామలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల తొలగింపుపై నిరసన



మాధవరం ఫ్యాక్టరీ వద్ద టెంట్ వేసుకుని నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

మంత్రాలయం రూరల్ : మండల పరిధిలోని మాధవరం గ్రామంలోని ఇస్పాత్ మారుతీ ఫ్యాక్టరీ యాజమాన్యం స్థానిక ఉద్యోగ కార్మికులపై ఉక్కు పాదం మోపింది. స్థానిక ఉద్యోగులను ఉద్వాసనకు శ్రీకారం చుట్టింది. మంగళవారం మాధవరం గ్రామానికి చెందిన 16 మంది హౌస్‌కిపింగ్ లెబర్స్‌ను తొలగించాలని రంగం సిద్ధం చేయడంతో స్థానిక ఉద్యోగులు మంగళవారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. స్థానిక కార్మికులను వెంటనే విధులలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులు మైత్రి శివ, శివరాజు, నరసింహులు, చెన్నప్ప, టిప్పుసుల్తాన్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు హుండీ ఆదాయం లెక్కింపు

కౌతాళం : ప్రముఖ ఉరుకుంద ఈరన్న స్వామి క్షేత్రంలో హుండీ ఆదాయం లెక్కింపు బుధవారం చేపడతున్నట్లు డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ స్థానిక హుండీ భవనంలో ప్రత్యేక నిఘా మధ్య కానుకల కౌంటింగ్ ఉంటుందన్నారు. శ్రావణమాసం రెండవ సోమవారం ముగియడంతో లెక్కింపు చేస్తామన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి



మంత్రాలయం తహసీల్దార్ రమాదేవికి వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

మంత్రాలయం రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టు సమస్యలను పరిష్కరించాలని ఏపీడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు చాంద్‌బాషా, నియోజకవర్గ అధ్యక్షుడు జయరాజు, ప్రధాన కార్యదర్శి ఉసేని డిమండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆ సంఘం నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. అర్హులైన విలేకరులకు అక్రిడేషన్, ఇళ్ల స్థలాలు, జర్నలిస్టుల ప్రమాద బీమాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పాత అక్రిడేషన్ గడువు పెంచకుండా రాష్ట్రంలో పని చేస్తున్న జర్నలిస్టులందరికీ కొత్తకార్డులు మంజూరు చేయాలన్నారు. విశ్రాంత పాత్రికేయులకు ఇతర రాష్ట్రాలలో అమలు చేస్తున్న పాత్రికేయ పింఛన్ పథకాన్ని మన రాష్ట్రంలో అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజే నియోజకవర్గ ఉపపాధ్యక్షులు గోవిందు, నాగరాజు, కోశాధికారి సాబువల్లి, మండల గౌరవ అధ్యక్షులు రానోజీరావు, మండల అధ్యక్షులు భీమరాయ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: ఎమ్మిగనూరులో ఏపీడబ్ల్యూజే తాలూకా అధ్యక్షుడు శ్రీనివాసులు నాయుడు ఆధ్వర్యంలో జర్నలిస్టులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ వీర భద్రగౌడ్‌కు అందజేశారు. నాయకులు చిన్న ఆకుల నాగరాజు, నూర్‌అహమ్మద్, బాష, అష్రాఫ్, భీమన్న, రామకృష్ణ, పరమేశ్వర తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండల కేంద్రంలో ఏపీయూడబ్ల్యూజే మండల అధ్యక్షుడు అక్బార్ బాష, గౌరవ అధ్యక్షుడు కిరణ్ కుమార్, ఏపీయూడబ్ల్యూజేఎఫ్ తాలుకా ఉపాధ్యక్షుడు దండు ఖాజా ఆధ్వర్యంలో జర్నలిస్టులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ రాజేశ్వరికు వినతిపత్రం అందజేశారు. అనిఫ్, ఖలీల్, గౌస్, షఫీ, కరుణాకర్, ఈశ్వర్, గజేంద్ర రెడ్డి, జయన్న, సురేష్, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు విధుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దు



ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న డీసీహెచ్‌ఎస్

ఎమ్మిగనూరురూరల్: డాక్టర్లు విధుల పల్ల నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ జఫ్రుల్లా హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఏరియా ప్రభుత్వాసుపత్రిని తనిఖీ చేశారు. నూతనంగా ప్రారంభించిన హాస్పిటల్‌ను పరిశీలించి, గదుల వినియోగంపై సూపరింటెండెంట్ డాక్టర్ సుధాను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ డాక్టర్లు రోజూ తాము చూసి ఓపీ, చేసిన అపరేషన్ల వివరాలను సాయంత్రం 4 గంటల తరువాత సూపరింటెండెంట్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలన్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించేలా చూడాలని, వారు ఇబ్బంది పడేలా వ్యవహరించొద్దని సూచించారు. నోడల్ అధికారి డాక్టర్ బాలజీ కుమార్, డాక్టర్లు ఉన్నారు.

స్మార్ట్ మీటర్లను తొలగించాలి



ఆదోనిలో ఎస్ఈ పంపాపతికి వినతి పత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఆదోని రూరల్: స్మార్ట్ మీటర్లు, సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ గ్రౌండ్ నుంచి ప్రదర్శన నిర్వహించారు. విద్యుత్‌శాఖ డీఈ కార్యాలయానికి చేరుకుని ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ ఎస్ఈ పంపాపతికి వినతి పత్రం అందించారు. సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు గోపాల్, వీరేష్, జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు అజయ్ బాబు, నాయకులు గోపాల్, వీరేష్, కల్లుబావి రాజు తదితరులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు : స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న, సీనియర్ నాయకులు పరమేష్, ఈరన్న రైతులు పాల్గొన్నారు.

కోసిగి : స్మార్ట్ మీటర్లు బిగించరాదని, పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని సీపీఎం మండల కార్యదర్శి రాముడు, సీపీఐ మండల కార్యదర్శి గోపాల్ డిమాండ్ చేశారు. స్థానిక సబ్‌స్టేషన్ ముందు ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు.

కౌతాళం: ప్రజలకు భారంగా మారే విద్యుత్ మీటర్స్ రద్దు చేయాలని, విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించాలని కోరుతూ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య, రైతు కూలీ సంఘం ప్రధాన కార్యదర్శి జగదీష్, రైతు సంఘం మండల కార్యదర్శి ఈరన్న నేతృత్వంలో ఐక్యవేదిక ఆధ్వర్యంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు ధర్నా చేపట్టారు.

మంత్రాలయం రూరల్: మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయంలో సీపీఎం ఆధ్వర్యంలో స్మాట్ మీటర్లను రద్దు చేయాలని కొరుతూ ఆ పార్టీ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. నాయకులు లక్ష్మన్న, ప్రాణేష్, రైతు సంఘం నాయకులు జయరాజు, వీరేష్, కేవీపీఎస్ నాయకులు అంజి పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని విద్యుత్ శాఖ డీఈ కార్యాలయం ఎదుట ప్రజా ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ప్రజా ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ , నాయకులు సత్యన్న,గనేష్, తిమ్మన్న రాజు, రాముడు పాల్గొన్నారు.

గోనెగండ్ల : ప్రజా సంఘాల ఐక్య వేదిక సీపీఎం, సీపీఐ, కేవీపీఎస్, సీఐటీయూ, ఏపీ డీకేఎస్, ఏఐటీయూసీల ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించి ఏఈ సుధాకర్ రావుకు వినతిపత్రం అందజేశారు. నాయకులు కరుణాకర్, మద్దిలేటి నాయుడు, నబి రసూల్ తదితరులు పాల్గొన్నారు.

నందవరం : మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో విద్యుత్ చార్జీలు తగ్గించాలని కొరుతూ ఆ పార్టీ నాయకులు రాస్తారోకో చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంపన్నగౌడ్, సోమేశ్వరరెడ్డి, మండల కార్యదర్శి గిడ్డయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడికి పరామర్శ



గోపాల్‌రెడ్డితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్సీ మధుసూదన్

ఆదోనిటౌన్: తుంటి శస్త్ర చికిత్స జరిగి అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఎస్.గోపాల్‌రెడ్డిని మంగళవారం మాజీ ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, ఆదిత్య నర్సింగ్ హోం డాక్టర్ శ్రీనివాసులు పరామర్శించారు. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని, సకాలంలో వైద్యం చేయించుకోవాలని మాజీ ఎమ్మెల్యే సూచించారు.

ప్లాట్లను కబ్జా చేశారని నిరసన

ఆదోని అర్బన్: పట్టణశివారులోని ఇందిరమ్మ కాలనీ సమీపంలో ఉన్న 5.64 ఎకరాల భూమిలో ఉన్న ప్లాట్లను కబ్జా చేశారని, మాకు న్యాయం చేయాలని కోరుతూ బాధితులు వారి ప్లాట్ల వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. బాధితులు ముద్దమ్మ, నాగరాజు, వలి, నాగలక్ష్మి, సావిత్రమ్మ, మహేష్, అనిత మాట్లాడుతూ భూమి యజమానులు హజరత్, షేక్షావలి, ఖైరున్‌బీల నుంచి 2011 సంవత్సరంలో బ్రోకర్ శ్రీనివాసులు ద్వారా ప్లాట్లు కొన్నామని తెలిపారు. అయితే మూడు రోజుల క్రితం గులామ్ అనే వ్యక్తి వచ్చి భూమి తనదేనని, ప్లాట్లు వేసిన తమ రాళ్లను తొలగించి చదును చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై సబ్‌కలెక్టర్, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు.

రేపు చేనేత దినోత్సవం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని మాచాని సోమప్ప మెమోరియల్ హాల్‌లో గురువారం బుట్టా ఫౌండేషన్ అధినేత బుట్టా శివనీలకంఠ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుకల ఆధ్వర్యంలో చేనేత వస్త్ర దినోత్సవాన్ని పార్టీలకతీతంగా నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం రాష్ట్ర, జిల్లా నాయకులు మాచాని వెంకటేష్, ఎంకే శివప్రసాద్, నీలకంఠ, చంద్రశేఖర్, సోమశేఖర్, రఘు తెలిపారు. మంగళవారం చేనేత వస్త్ర దినోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ బుట్టా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'ఎమ్మిగనూరు హెరిటేజ్ లూమ్స్' అనే యాప్‌ను ప్రత్యేక తయారు చేయడం జరిగిందని, చేనేత వస్త్ర దినోత్సవం రోజున దీనిని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ యాప్ ద్వారా దేశ నలుమూలల మార్కెటింగ్ చేయడం, తదితర అంశాలను తెలియజేయడం జరుగుతుందన్నారు. సదస్సుకు చేనేత కార్మికులు పార్టీలకు అతీతంగా తరలి రావాలని పిలుపునిచ్చారు.

హామీలు అమలు చేయకుండా మోసం



బాబు మోసపు హామీలతో ఏమేర నష్టపోయారో జాబితాను ప్రదర్శిస్తున్న నాయకులు

పెద్దకడబూరు : అధికారంలోకి వచ్చి దాదాపు 14 నెలలు కావస్తున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం మోసం చేస్తుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం రెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు మండల పరిధిలోని మేకడోణ, ముచ్చగిరి, నౌలేకల్లు గ్రామాలలో మంగళవారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాలలో ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు, వాటిని అమలు చేయకుండా చేస్తున్న మోసం గురించి ప్రజలకు వివరించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎంతమేర లబ్ది పొందినారో, ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయంలో ఎంతమేర నష్టపోయారో ప్రజలే గుర్తించుకోవాలన్నారు. కార్యక్రమంలో బూత్ కమిటీ డివిజన్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ సర్పంచ్ విజయేంద్రరెడ్డి, జిల్లా యువజన విభాగం కార్యదర్శి శివరామిరెడ్డి, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడు ముక్కరన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి ఈరన్న, నాయకులు పాల్గొన్నారు.

రామమ్మదేవి ఆలయంలో పాదుకల ప్రతిష్ట



ఆలయంలో పాదుకల ప్రతిష్టాపనలో భక్తులు

నందవరం : మండల కేంద్రంలోని నాగలదిన్నె రోడ్‌లో వెలసిన మాతా రామమ్మ దేవి ఆలయంలో మంగళవారం పాదుకలు, త్రిశూల ప్రతిష్టాపన గావించారు. ఆలయంలో అమ్మవారికి తెల్లవారుజాము నుంచే జలాభిషేకాలు, కుంకుమార్చన, పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం వంటి విశిష్ట పూజలు గావించారు. అనంతరం అమ్మవారికి పాదాలు, త్రిశూలం ప్రతిష్టాపన చేశారు. పాదాల దాతలు రుద్రప్ప, మల్లప్పగౌడ్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యే క పూజాది కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం అమ్మ వారి పేరిట గోమాతను ఆలయానికి కానుకగా అందించారు. కార్యక్రమంలో ఆలయ కార్యదర్శులు శ్రీనివాసులు, శేషాద్రి, పరశురాముడు, బసవరాజు, మీసాల సంపత్‌గౌడ్, నాగరాజుగౌడ్, నారాయణ, వీరేష్ పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి



విద్యార్థులతో వివాద పరిష్కార కమిషన్ జిల్లా చైర్మన్ కె.కిశోర్‌కుమార్

కర్నూలు(సెంట్రల్): క్రయ, విక్రయాలు చేసే వినియోగదారులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్ జిల్లా చైర్మన్ కె.కిశోర్‌కుమార్, సభ్యుడు నారాయణరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మిగనూరు రాయ్స్ డిగ్రీ కళాశాల బీకాం విద్యార్థులు వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్‌ను సందర్శించారు. అక్కడ వారికి వినియోగదారుల హక్కులపై చైర్మన్, సభ్యులు రెండు గంటలపాటు అవగాహన సదస్సును నిర్వహించారు. న్యాయవాదులు అనుదీప్‌రెడ్డి, స్టీఫెన్ పాల్గొన్నారు.

పెద్ద చెరువుపై నిర్లక్ష్యం వీడాలి

ఆదోని రూరల్: పాండవగల్ పెద్ద చెరువు పట్ల అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వీడాలని సీపీఎం మండల కార్యదర్శి కె.లింగన్న అన్నారు. మంగళవారం వృథాగా వెళ్తున్న చెరువునీటిలో నిల్చొని నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ.. మండలంలోని పాండవగల్ గ్రామంలో సర్వేనంబర్ 135లో 20 ఎకరాల భూమిని భూస్వామి విజయలక్ష్మి ఆక్రమించి పొలాన్ని సాగు చేయడం వల్ల నేడు కురిసిన వర్షానికి భారీగా నీరు వృథాగా వెళ్తున్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు మొద్దు నిద్ర వీడి పాండవగల్ పెద్ద చెరువు సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, పాండురంగ, కొండయ్య, గోవిందు, దివాన్‌బాషా, రఫిక్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా ధ్వంసం

ఆదోని రూరల్: పట్టణ శివారులోని రణమండల కొండల్లో మంగళవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు చేసి 400 లీటర్ల నాటుసారా తయారీకి ఉపయోగించే సామగ్రిని ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ సైదులు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. దాడుల్లో 15 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఆదోని పట్టణంలోని బోయగేరికి చెందిన బోయ వీరేష్‌పై కేసు నమోదు చేశామన్నారు. అలాగే మండలంలోని పెద్దతుంబలం గ్రామంలో నరసయ్య అనే వ్యక్తి కర్ణాటక మద్యం అమ్ముతుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ మహేష్‌కుమార్ తెలిపారు. అతని వద్ద నుంచి 40 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

కలసికట్టుగా అభివృద్ధికి కృషి చేద్దాం



మాట్లాడుతున్న విశ్రాంత ఐజీ షేక్ మహమ్మద్ ఇక్బాల్

ఆదోని సెంట్రల్: అందరం కలసి కట్టుగా మనం పుట్టిన ఊరు, మనం చదువుకున్న పాఠశాలల అభివృద్ధికి కృషి చేద్దామని విశ్రాంత ఐజీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని అస్మియా పురపాలక ఉన్నత ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నూర్ బాషా అధ్యక్షతన సమావేశం నిరహించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలను దత్తతతీసుకొని పాఠశాలకు అప్‌స్టేర్‌కు ఎక్కడానికి మెట్లు, ఫెన్సింగ్ వంటివి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు అవసరమైన స్పోర్ట్స్ కిట్లు, పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి భూపాల్ రెడ్డి, అయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గిరి, అలిమ్ సిద్దిఖీ ఖాజీ అల్తాఫ్ ముస్లిం మైనార్టీ నాయకులు ఇలియాస్, యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.